సుబ్బారావు చావు

వసుంధర

డిటెక్టివ్ వెంకన్న అసిస్టెంట్సు సీతమ్మ, రాజమ్మ కార్లోంచి దిగగానే ఇనస్పెక్టర్ శంకర్రావు వారికి ఎదురెళ్ళి—"రండి రండి—మీ కోసమే యెదురుచూస్తున్నాను—" అన్నాడు.

వెంకన్న మందహాసం చేసి అసిస్టెంట్సు వంక చూశాడు. వాళ్ళిద్దరూ చేతిలో నోట్ బుక్ తో, పెన్సిల్ తో సిద్ధంగా ఉన్నారు. వెంకన్న చిరునవ్వు చూస్తూనే వాళ్ళు శంకర్రావు మాటలు నోట్ చేసుకున్నారు.

"మీరు మా కోసం యెదురుచూస్తున్నాననడం రికార్డయింది. తర్వాత మీ రొప్పుకోకపోయినా ఈ రికార్డు నా మనసుకు తృప్తినిస్తుంది—...." అన్నాడు వెంకన్న.

"నా కారణంగా మీరు తృప్తిపడితే—అదే నాకు సంతోషం...." అన్నాడు శంకర్రావు.

"శవ మెక్కడుంది?" అన్నాడు వెంకన్న విషయానికి

వస్తూ.

"బెడ్రూంలో మంచంమీద—చాలా విషాదమైన కేసు. భార్యాభర్తలిద్దరూ ఒకే మంచంమీద పడుకున్నారు. అప్పుడిద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు. తెల్లారి లేచేసరికి భర్త శవంగా మారాడు. భార్య వళ్ళు తెలియని నిద్రలో వుంది. పాలవాడదేపనిగా తలుపు తట్టగా తట్టగా మెలకువ వచ్చింది...."

"హార్టు ఎటాకా?" అన్నాడు వెంకన్న.

అప్పటికి శంకర్రావు, వెంకన్న, శవమున్న గదిలో ప్రవేశించారు. సీతమ్మ, రాజమ్మ వారి ననుసరించారు.

శవం నీలంరంగులో వుంది.

"మీ ప్రశ్నకు జవాబు లభించిందా?" అన్నాడు శంకర్రావు.

"విషప్రయోగమన్నమాట!" అన్నాడు వెంకన్న.

శంకర్రావు తలాడించి—"ఎలా జరిగిందో తెలియడం లేదు. ఇల్లంతా గాలించినా ఎక్కడా ఎలాంటి విషమూ దొరకలేదు. ఇంటి తలుపు అన్నివైపుల నుంచీ వేసి ఉన్నాయి. ఇంట్లో భార్యాభర్తలిద్దరూ తప్ప ఎవ్వరూ లేరు. లోపలకెవరూ వచ్చిన జాడలేదు. తన భర్త కేటు వంటి దిగులూ లేదనీ ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం లేదనీ భార్య అంటోంది. వారిది నలుగురూ అసూయపడే అన్యోన్య దాంపత్యమనీ, భార్యది మంచి మనస్తత్వమనీ ఆమె సుగుణవతి అనీ యిరుగూ పొరుగూ అంటున్నారు. ఇది ఆత్మహత్య అయుండాలి. హత్యయితే భార్యే చేసి ఉండాలి. ఆమె చాలా అందంగా, అమాయకంగా ఉంది. అనుమానంమీద ఆమెనరెస్టు చేయడానికి మన సొప్పడంలేదు. ఏంచేయాలో పాలుపోక మీకు ఫోను

చేశాను—" అన్నాడు.

వెంకన్న అతని మాటలు వింటూ శవాన్ని చూస్తు న్నాడు.

హతుడి వయసు ముప్పై దాటదు. కనుముక్కు తీరు చక్కగావుంది. మనిషి మంచి పొడగరి. సుమారైనలావు. అందమైన గంభీరమైన మీసాలు....

అప్రయత్నంగా—"నేనొకసారి హతుడి భార్యను చూడాలి...." అన్నాడు వెంకన్న.

"పక్క గదిలో ఉందామె. భోరున ఏడు స్తోంది—...."

వెంకన్న పక్కగదిలోకి వెళ్ళాడు. అతడి ననుసరిం చారు అసిస్టెంట్సు.

లోపల గోడవారగా కూర్చుని ఏడుస్తోందో యువతి. ఆమె తల మోకాళ్ళపై ఉంది. వెక్కిళ్ళు ఆగకుండా వస్తున్నాయి.

వెంకన్న అసిస్టెంట్సువంక చూశాడు.

సీతమ్మ, రాజమ్మ ఆమె చెరోపక్కకు వెళ్ళి కూర్చు న్నారు. సీతమ్మ ఆమె భుజంమీద చేయి వేసింది.

ఉలిక్కిపడి తలెత్తిందా యువతి. ఆమెకు ఎదురుగా వెంకన్న కనిపించాడు.

"నా పేరు వెంకన్న. నేనొక డిటెక్టివును. ఈ కష్ట సమయంలో నీకు సాయపడాలని వచ్చాను. నీ పేరు చెప్పమ్మా" అన్నాడు వెంకన్న.

"వసంత—" అందామె.

"మీ వారి పేరు?—"

"సుబ్బారావు!"

"వారేం చేస్తున్నారు?"

"సెంట్రల్ గవర్నమెంట్ లేబరేటరీలో సైంటిస్టు— ...."

"ఆయనకు శత్రువులున్నారా?"

"ఉన్నారు— ...."

వెంకన్న కళ్ళు మెరిశాయి—"వారి వివరాలు చెప్పమ్మా!"

"నేనే ఆ శత్రువుని. నేనే వారిని చంపాను...." అంటూ ఆమె భోరున ఏడ్చింది.

వెంకన్న ఆమెను సమాయించుకోనిచ్చి-"చూడమ్మా! దుఃఖాన్ని అణచుకో. పోయిన వారెలాగూ తిరిగిరారు. నువ్వు జైలుపాలుకావడం నా కిష్టంలేదు. నీకు సాయ పడాలనే వచ్చాను...." అన్నాడు.

"నాకెవరి సాయమూ వద్దు. వారు లేకపోయాక నా బ్రతుక్కి అర్థంలేదు. ఈ హత్య నేనే చేశాను. నన్నురితీసే నేమా వారిని చేరుకుంటాను...." అందామె జీర వోయిన కంఠంతో.

"సరే — హత్య నువ్వే చేశావు. అందుక్కారణమేమిటి?"

"నేను దుర్మార్గురాల్ని—పాపాత్మురాల్ని. నావంటి వాళ్ళు మనుషుల్ని చంపడానికి కారణాలుండవు...." అంది వసంత ఏడుస్తూనే.

"నీ భర్త పోయిన దుఃఖంలో నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలియడంలేదు. నువ్వే ఈ హత్య చేశావంటే నీకు పడేది ఉరిశిక్ష కాదు. యావజ్జీవ కారాగార శిక్ష. నేరంచేయకపోయినా జైలుపాలై నేరస్థుల మధ్య నికృష్ట జీవితం అనుభవించాలి ..."

"అన్నింటికీ నేను సిద్ధంగా వున్నాను...." అంది

వసంత.

వెంకన్న ఆమెతో ఇంకేమీ మాట్లాడకుండా బయటకు వచ్చాడు.

"ఏమంటుందామె?" అన్నాడు శంకర్రావు.

"నేనేమడిగినా ఏడుస్తుంది తప్ప నోరు విప్పదు. మీరామెచేత పలికించడమే పెద్ద విశేషం....అంతా విన్నాను నేను. అంటే ఆమే యీ హత్యచేసి తర్వాత బాగా అప్సెట్టయిందన్నమాట........" అన్నాడు శంకర్రావు.

"ఆమె హత్యచేసిందని చెప్పలేను కానీ అప్సెట్ మాత్రం అయింది—"

"ఏమైనా ఆమెను నే నరెస్టు చేయాలనుకుంటున్నాను...."

"వద్దు...." అన్నాడు వెంకన్న.

"వదరకు వెంకన్నగారూ! ఇది హత్యకేసు. హత్య చేసే అవకాశం ఆమెకు తప్పలేదు. ఆమె తనే హత్య చేశానంటోంది...."

"ఆమె తరఫున నేను హామీ ఉంటాను. ఇదామె నరెస్టు చేయడానికి సమయంకాదు. నేనామెను మా యింటికి తీసుకుని వెడతాను. ఆమెను సముదాయించి మామూలు మనిషినిచేసే బాధ్యత నా శ్రీమతికి అప్ప గిస్తాను. ఈలోగా మనం సేకరించవలసిన సమాచారం చాలా వుంది—" అన్నాడు వెంకన్న.

"మీరు హామీ ఉంటానంటే సరే-అయితే బాధ్యత మీదే!" అన్నాడు శంకర్రావు.

"బాధ్యతగల వాణ్ణి. నాకు బాధ్యత గురించి మీరు హెచ్చరించాల్సిన అవసరంలేదు-" అన్నాడు వెంకన్న.

2

వేలిముద్రల నిపుణుడి రిపోర్టు ప్రకారం—అనుమాన ప్రదేశాల్లో లభించిన వేలిముద్రలు — సుబ్బారావువి, వసంతవి. మూడో మనిషివి లేవు.

పోస్టుమార్టం రిపోర్టు ప్రకారం-ఒక అద్భుత విశేషం తెలిసింది. సుబ్బారావు ప్రాణంతీసిన విషం ఎక్స్ థర్టీటూ. అది కొత్తగా కనిపెట్టబడిన విశేషం. దాన్ని కాఫీ, టీలలో కూడా కలిపివ్వవచ్చు. మంచినీళ్ళలో కలిపివ్వవచ్చు. దానివల్ల ద్రావకానికి రంగు మారదు. దానికి రుచిలేదు. పుచ్చుకున్నాక పన్నెండుగంటలదాకా దాని ప్రభావముండదు. అప్పుడది ఉన్నట్టుండి ప్రభావం చూపిస్తుంది. గుండెల్లో నొప్పి వస్తుంది. అరుద్దామన్నా గొంతు పెగలదు. కాళ్ళు, చేతులు కదపాలన్నా సాధ్యంకాదు. ప్రాణం పోవడానికి రెండు మూడు నిముషాలు పడుతుంది. అప్పుడు హతుడనుభవించే నరకయాతన వర్ణనాతీతం. చనిపోవడానికి నిముషంముందు శరీరం నీలంగా మారుతుంది. ఆ సమయంలో ఆ శరీరంనుండి ఓ వింత పరిమళం వస్తుంది. అది పక్కనున్న వారిలో గాఢ నిద్రను కలగజేస్తుంది. సుబ్బారావు తెల్లవారుఝామున మూడుగంటలకు మరణించాడు. అంటే అంతకుముందు రోజు మధ్యాహ్నం రెండుగంటల మధ్యలో అతడిపై విషప్రయోగం జరిగి ఉండాలి.

వెంకన్నకు ఎక్స్-32 విషం గురించి తెలుసు. ఆ విష ప్రయోగంలో గత ఆరుమాసాల్లోనూ ప్రపంచమంతటా యెనిమిది హత్యలు జరిగాయి. అయితే ఆ విషం సామాన్యుల కందుబాటులో ఉండదు. మెడికల్ షాపుల్లో దొరకదు. దాన్ని ప్రత్యేకంగా కొన్ని డిపార్టుమెంట్సు-

ఇంపోర్టు చేసుకుంటాయి. అందులో పోలీసు డిపార్టుమెంటు కూడా ఉంది.

వెంకన్న పోస్టుమార్టం రిపోర్టు చూడగానే—సుబ్బారావు పని చేసే లాబరేటరీకి వెళ్ళాడు. సుబ్బారావు చనిపోయే ముందు రోజు లాబరేటరీకి వెళ్ళాడు. రోజంతా లాబరేటరీలోనే వున్నాడు. లాబరేటరీలో ఎక్స్-32 విషం వుంది. రెండువందలయాభై గ్రామ్ బాటిల్సు రెండుండాలి లాబరేటరీలో. వాటిని మధుమూర్తి అనే సైంటిస్టు—రసాయనిక ప్రయోగంకోసం తెప్పించాడు. వెంకన్న మధుమూర్తిని కలుసుకుని — "వాటితో మీకు పనేమిటి?" అనడిగాడు.

"నా అనాలిసిస్‌లో ఇనుము ప్రతిబంధకం. దాన్ని మాస్కు చేయడానికి అస్కార్బిక్ ఆసిడ్‌లాంటి రసాయనాలు చాలా ఉన్నాయి. కానీ నా అనాలిసిస్‌లో అవన్నీ ఇంటర్ఫియరవుతాయి. ఎక్స్-32 వల్ల ఇనుము మాస్కవుతుంది. అనాలిసిస్‌లో ఇంటర్ఫియరన్సుండదు-" అన్నాడు మధుమూర్తి.

"కానీ—అలాంటి ప్రమాదకరమైన విషం మీ దగ్గరుండడం — ప్రమాదం కదూ!" అన్నాడు వెంకన్న.

"ప్రమాదమనుకుంటే ప్రయోగాలు చేయలేం. నా దగ్గర సోడియం, పొటాషియం సయనైడ్సున్నాయి. సెకన్లలో ప్రాణాలుతీసే ఆ విషాలతో కనీసం నెలకొక్క ప్రయోగమైనా చేస్తాను నేను—" అన్నాడు మధుమూర్తి.

"మరి మీకు భయం వేయదూ?"

"తగు జాగ్రత్తలు తీసుకుంటే చాలు—ఏ భయమూ ఉండదు—"

"మీ దగ్గరున్న ఎక్స్-32 యెవరికైనా యిచ్చారా?"

"లేదు—అది లాకండ్ కీలో యెప్పుడూ నా దగ్గరే ఉంటుంది...."

"ఇప్పుడూ ఉందా?"

"వారంరోజుల క్రితం నేను వాడాను...."

"ఇప్పుడు నేనోకసారి చూడవచ్చా?"

"ష్యూర్—" అంటూ లేచాడు మధుమూర్తి. అతడు లాబరేటరీలోని పక్క గదిలోకి వెళ్ళి కొద్ది క్షణాల్లో ఓ రెండు చిన్న సీసాలతో తిరిగి వచ్చాడు. అతడు వెంకన్నకా సీసాలందించాడు. అందులో ఒకటి సీల్డు బాటిల్. ఒకదానికి మాత్రం మూత సులభంగా వచ్చింది.

"ఇది నేను వాడుతున్నాను. నా ప్రయోగానికి—అరగ్రాము చాలు...." అన్నాడు మధుమూర్తి.

వెంకన్న పరీక్షగా ఆ సీసానే చూస్తూ—"మనిషి ప్రాణాలు తీయడానికెన్ని గ్రాములు కావాలి?" అన్నాడు.

"అయిదువందల మిల్లీగ్రాములు — అంటే అర గ్రాము...."

"ఈ సీసా మీవద్ద నున్నట్లింకెవరికైనా తెలుసా?"

"ఎందుకు తెలియదు? చాలామంది సైంటిస్టులకు తెలుసు. మా పర్చేజ్ డిపార్టుమెంటుకీ, స్టోర్సు డిపార్టుమెంటుకీ కూడా తెలుసు...."

"ఎవరైనా మిమ్మల్నీ విషం కావాలని అడిగి తీసుకున్నారా?"

"అడిగితే మాత్రం నేనెందుకిస్తాను?"

"ప్రయోగాలకని అడిగినా యెవరికీ యివ్వరా?"

"ఎక్స్-32తో ప్రయోగాలు చేసేవాణ్ని లాబొరేటరీ మొత్తంమీదా నేనొక్కడినే—" అన్నాడు మధుమూర్తి.

"అంటే ఈ ఊరి మొత్తంమీద ఎక్స్-32 వున్నవారు మీరొక్కరే! ఆ ఎక్స్-32 ప్రయోగంతో సుబ్బారావు మరణించాడు. సుబ్బారావు ఆఫీసులో ఉండగా ఆఫీసు సమయంలో ఈ విషప్రయోగం జరిగింది. దీనికి మీరేం సమాధానం చెబుతారు?" అన్నాడు వెంకన్న.

ఉన్నట్టుండి మధుమూర్తి ముఖానికి చెమటలు పట్టాయి—"సుబ్బారావుపై విషప్రయోగం జరిగిందని నాకు తెలియదు...." అన్నాడతడు.

"మీ కొలీగ్ పోయాడని మీకు సెలవు కూడా యిచ్చారు. అతడెలా పోయిందీ కూడా మీరు తెలుసుకోలేదా?"

"నేనాఫీసు విషయాలేవీ పట్టించుకోను. నాలోకమే నాది. ఆఫీసుకు సెలవిచ్చినా — నాకేవో ప్రయోగాలుంటే చూసుకున్నాను తప్ప యింటికీ వెళ్ళిపోలేదు. సంతాప సమావేశానికి మాత్రం వెళ్ళి రెండు నిముషాలు మౌనం వహించాను...." అన్నాడు మధుమూర్తి.

అతడి మాటలమాయకంగా తోచాయి వెంకన్నకి—"సరే—ఇప్పుడు చెప్పండి—ఎక్స్-32 సుబ్బారావుకి మీరే యిచ్చారా?"

"నేనెందుకిస్తాను?" అన్నాడు మధుమూర్తి కంగారుగా.

"ఇచ్చే అవకాశం ఇంకెవ్వరికీ లేదు కాబట్టి—మిమ్మల్నే అనుమానించాలి—" అన్నాడు వెంకన్న.

మధుమూర్తి చాలా కంగారుపడిపోయాడు. అతడు

బాగా ఆలోచించి—"నా లాబరేటరీ అసిస్టెంటు సుధాకర్ కి నేను తరచుగా బీరువా తాళాలిస్తూంటాను—" అన్నాడు.

వెంకన్న సాలోచనగా—"ఈ సీసాలోని విషం తగ్గితే మీకు తెలుస్తుందా?" అన్నాడు.

"ఎవరైనా పది పదిహేను గ్రాములు తీసుకుంటే తెలుస్తుంది తప్ప—రెండు మూడు గ్రాములు తీసుకుంటే తెలియదు...."

"ఇలాంటి భయంకర విషం దగ్గరున్నప్పుడు ప్రతి మిల్లీగ్రామునూ ఎప్పటికప్పుడు లెక్కించాలని మీకు తెలియదా? తెలుసుకోవడం మీ బాధ్యత కాదా?" అన్నాడు వెంకన్న కఠినంగా.

"వెంకన్నగారూ! ఇందాకట్నుంచి మీరు విషం విషం అంటున్నారు. కానీ నాకు సంబంధించినంతవరకూ ఇది విషం కాదు. రసాయనం. ప్రమాదకరమైన ప్రతి రసాయనాన్నీ విషంగా భావిస్తే సైంటిస్టులు ప్రయోగాలు చేయలేరు...."

"సరే—అదలాగుంచండి. మీరు మీ అసిస్టెంటు సుధాకర్ గురించి చెప్పారు. అతడికీ ఎక్స్-32 అందుబాటులో వుంది. అతడికీ సుబ్బారావుకీ యేమైనా శత్రుత్వముందా?"

"నాకు తెలియదు. నేను లాబ్‌లో యెవరితోటీ యెక్కువ మాట్లాడను. సుబ్బారావుతో కూడా నా పరిచయం అంతంతమాత్రం...." అన్నాడు మధుమూర్తి.

వెంకన్న సుధాకర్ని కలుసుకుని—సూటిగా విష ప్రయోగం గురించి అడిగాడు. సుధాకర్ కంగారుపడి

తనకేమీ తెలియదన్నాడు.

"తెలియదంటే వదరదు—పోలీసులు నిన్నరెస్టు చేస్తారు...."

"నేనేపాపం ఎరుగను!" అన్నాడు సుధాకర్.

"నువ్వేపాపం ఎరక్కపోతే—సుబ్బారావుకి విష ప్రయోగమెలా జరిగింది? నీకు, మధుమూర్తికి తెలియకుండా ఇంకెవరైనా ఆ సీసా తీసుకోగలరా?"

"తీసుకోలేరు సార్!" అన్నాడు సుధాకర్.

"అయితే నిజం చెప్పు—నువ్వెవరికైనా ఎక్స్—32 ఇచ్చావా?"

సుధాకర్ తల అడ్డంగా ఊపాడు.

"బాగా ఆలోచించుకుని చెప్పు. ఈ సమాధానంమీద నీ భవిష్యత్తాధారపడి ఉంది—" అన్నాడు వెంకన్న.

"నాకేం తెలియదు సార్...."

"సరే—ఈ మాటలతో ఇన్‌స్పెక్టర్ శంకర్రావుని కూడా నమ్మించు. నువ్వు అరెస్టవడం ఖాయం—" అన్నాడు వెంకన్న.

సుధాకర్ వెంటనే—"మీరు మధుమూర్తినెందుకు అనుమానించరు?" అన్నాడు.

"ఎందుకంటే—నీకూ, సుబ్బారావుకీ మాత్రమే శత్రుత్వమున్నట్లు ఆధారాలున్నాయి—" అన్నాడు వెంకన్న.

"ఎవరు చెప్పారు?"

"ఎవరు చెప్పారో చెప్పను...." అన్నాడు వెంకన్న.

సుధాకర్ మాట్లాడలేదు.

వెంకన్న అతడితో—"బాగా ఆలోచించుకో—చిన్న నిజాన్ని దాచి సాక్షిగా సాగిపోతున్న సంసారంలో

కల్లోలం సృష్టించుకోవ—" అన్నాడు.

తర్వాత అతడు పర్చేజాఫీసర్ డేనియల్ని, స్టోర్సాఫీసరు వెంకట్రామయ్యని కలుసుకున్నాడు. వాళ్ళతో మాట్లాడేక—మధుమూర్తి వద్ద ఎక్స్-32 ఉన్న విషయం ఆ ఆఫీసర్స్కే కాక—ఆ డిపార్టుమెంటులో గుమస్తాలందరికీ తెలుసని అర్ధమయింది. ప్రత్యేకించి ఏ ఒక్కరినీ అనుమానించడం కష్టం.

3

డిటెక్టివ్ వెంకన్న శంకర్రావుని కలుసుకుని, సెంట్రల్ గవర్నమెంటు లాబరేటరీలోని కొందరు ఉద్యోగుల పేర్లు చెప్పి—"కొన్నాళ్ళపాటు వీరిపై నిఘా ఉంచి—వీరి దినచర్యలు తెలుసుకోండి—" అన్నాడు.

"పనికివచ్చే సమాచారం దొరికిందా?"

"లేదు. కానీ ఎక్స్—32 ప్రయోగంతో సుబ్బారావు చనిపోయాడన్న విషయం మీరింకా బైటపెట్టలేదుకదా-అది నేనక్కడ బైటపెట్టాను. ఫలితంగా లాబొరేటరీలో చర్చలు ప్రారంభమవుతాయి. ఆసక్తికరమైన విశేషాలు బైటపడవచ్చు "

"బైటపడినా మనకెలా తెలుస్తాయి?" అన్నాడు శంకర్రావు.

"ఊళ్ళో నాకు కొందరు అభిమానులున్నారు. ఇలాంటి విషయాల్లో సాయపడడం వాళ్ళకు సరదా. ఒకరుకాదు—ఇలాంటి వారు వందల్లో ఉన్నారు. అదో పెద్ద నెట్ వర్కు. ఆ నెట్ వర్కును వదిలిపెడుతున్నాను. పనికొచ్చే సమాచారం చాలా దొరుకుతుంది...."

"దొరక్కపోతే?"

"ఇట్నించి నరుక్కు రావడమయింది—ఇక అట్నించి

నరుక్కు వస్తాను....'' అన్నాడు వెంకన్న.

"అంతే?"

"వసంత మామూలు మనిషవుతోంది. సుబ్బారావు వ్యక్తిగత విశేషాలు సేకరించాలి కదా...." అన్నాడు వెంకన్న.

శంకర్రావు వెంకన్నతో కరచాలనంచేసి — "ఈ కేసులో మీరు తొందరగా విజయం సాధిస్తారు...." అన్నాడు.

"అప్పుడు మీ దగ్గర ఫీజు వసూలు చేస్తాను—" అన్నాడు వెంకన్న.

"తప్పకుండా యిచ్చుకుంటాను. డబ్బుతో వెలకట్ట లేని ఫీజు...."

వెంకన్న అక్కణ్నించి ఇంటికి వెళ్ళాడు. అక్కడ సీతమ్మ, రాజమ్మ అతడికోసం యెదురుచూస్తున్నారు. వారి ముఖాల్లో ఉత్సాహముంది.

"ఏమైనా పనికివచ్చే సమాచారం లభించిందా?"

"అవును బాస్!" అంటూ సీతమ్మ అతడికి కాగితా లందించింది.

వెంకన్న ఆ కాగితాలు చూసి — "శభాష్!" అన్నాడు.

అది సీతమ్మ, రాజమ్మ కలిసి సంయుక్తంగా తయారు చేసిన నోట్సు. సాధారణంగా ఆ అసిస్టెంట్సిద్దరూ విడి విడిగా నోట్సు తయారుచేస్తారు. కలిసి పనిచేసినపుడల్లా మాత్రం ఫలితం విడివిడిగా చేసినప్పటికంటె అద్భుతంగా ఉంటుంది.

విన్నదాని కిద్దరి ఊహాశక్తి జోడించగా తయారయిన నోట్సది. వెంకన్న నోట్సును శ్రద్ధగా మూడుసార్లు చది

వాడు.

సుబ్బారావుకు లాబొరేటరీ అంటే ప్రాణం. సైన్సు తప్ప ఇంకో ధ్యాస లేదతడికి. తను కనిపెట్టిన విశేషాల నతడు సులభపద్ధతిలో భార్యకు కూడా చెబుతూంటాడు. అతడి కారణంగా ఆమెకూ వైజ్ఞానిక పరిశోధనలంటే ఆసక్తి కలిగింది. కొత్త పత్రిక రాగానే సీరియల్ నవల గురించి యెదురుచూసినట్లు—రోజూ భర్త రాకకోసం సాయంత్రాలెదురు చూసేది వసంత. ఆ రోజు పరిశోధ నల వివరాలడిగేది. సుబ్బారావెంతో సంతోషంగా ఆమెకన్నీ వివరించి చెప్పేవాడు.

సుబ్బారావుకు ప్రచారం గిట్టదు. అతడు చాలా గొప్ప విషయాలే పరిశోధిస్తున్నాడు. అతడి పరిశోధనా ఫలి తాలు విదేశీ పత్రికల్లో వచ్చాయి. కానీ అతడు ఇంటికి వచ్చే మిత్రులతో లాబొరేటరీ విశేషాలు మాట్లాడడు. తన పరిశోధనల గురించి చెప్పడు. భార్యతోనూ, సైంటి స్టులతోనూ మాత్రమే అతడు వాటిని గురించి మాట్లాడ తాడు. కానీ ప్రవీణ్‌కుమార్‌ను మాత్రం ఇందులో మిన హాయించాలి. అతడి ఉద్యోగమేమిటో తెలియదు కానీ అతడు శాస్త్రజ్ఞుడు కాదు. కానీ తరచుగా సుబ్బారావు, ప్రవీణ్‌కుమార్—రీసెర్చి విశేషాలు మాట్లాడుకునేవారు. ప్రవీణ్‌కుమార్ సుబ్బారావుకు ప్రాణమిత్రుడూ కాదు. చిన్ననాటి స్నేహితుడూ కాదు. ఇద్దరికీ ఎలా పరిచయ మయిందో తెలియదు వసంతకి. అతడు నెలకి ఒకటి రెండు సార్లు తమ యింటికి వస్తూంటాడు. తమ ఇంటికి రమ్మని యెప్పుడూ అడగలేదు. అతడికి వివాహమయిందో లేదో కూడా ఆమెకు తెలియదు. భర్త నడిగితే అతడి గురించి వివరాలడగొద్దని చెప్పాడు. ప్రవీణ్‌కుమార్ వసంతతో

ఎప్పుడూ మాట్లాడలేదు. అతడు రాగానే ఆమె కాఫీ యిచ్చేది. అతడు సుబ్బారావుకు థాంక్స్ చెప్పి వెళ్ళేవాడు. కానీ సుబ్బారావు మరణానికి వారం రోజుల ముందు మాత్రం అతడు—వసంతతో మాట్లాడాడు. చెల్లెమ్మా అని ఆప్యాయంగా పిలిచాడు. నీ భర్త జీనియస్ అన్నాడు. ఆ పూటకు వాళ్ళింట్లోనే భోంచేస్తానన్నాడు. తను కూడా స్వీట్సు పట్టుకుని వచ్చాడు. ఏం జరిగిందని వసంత భర్త నడిగింది. నా ప్రయోగాలవల్ల అతడు ప్రయోజనం పొందాడని చెప్పాడు సుబ్బారావు. వసంత వివరాలడిగితే సుబ్బారావు చెప్పలేదు. వారం గడిచాక చెబుతానన్నాడు. వారం గడిచేసరికి చనిపోయాడు.

ప్రవీణ్‌కుమార్ కాక సుబ్బారావుకున్న మిగతా స్నేహితులందరూ వసంతకు బాగా తెలుసు. అందరిళ్ళకూ రాకపోకలున్నాయి. అందరికీ సుబ్బారావంటే ఎంతో యిష్టం. ఆడా, మగా అందరూ సుబ్బారావు తెలివితేటల్నీ, నెమ్మదితనాన్నీ, సమయస్ఫూర్తినీ మెచ్చుకునేవారు. ఒక స్నేహితుడి భార్య మృణాళినికి వసంత దగ్గర చనువెక్కువ. పెళ్ళికి ముందు పరిచయమయుంటే సుబ్బారావును వసంతకు దక్కనిచ్చేదాన్ని కాదనీ—తనే పెళ్ళి చేసుకుని ఉండేదాన్ననీ ఆమె వసంతతో అంది. వీలుంటే అతడితో ఎఫైర్ పెట్టుకోవాలనుందని కూడా అందామె.

మృణాళిని మాట్లాడే పద్ధతి తమాషాగా ఉంటుంది. ఆమె నిన్ను చంపేస్తానని అన్నా తేలిగ్గా తీసుకోవాలనిపిస్తుంది తప్ప కోపం రాదు. మృణాళిని కారణంగా వసంతకు భర్తంటే ఆరాధనా భావం పెరిగింది తప్ప—

మృణాళినిపై కోపం రాలేదు. అయితే ఆమె భర్తకు మృణాళిని మాటలు చెప్పింది.

"నువ్వు చెప్పింది వింటూంటే నా కాళ్ళగానే ఉంది. కానీ మృణాళిని భర్త పెద్ద గూండా. పెద్దమనిషిలా కనబడతాడు కానీ పెద్దమనుషుల్ని కూడా నడి బజార్లో పాడిచేయగల మొండిధైర్యం మనిషి...." అన్నాడు సుబ్బారావు.

అప్పుడు వసంత భయపడింది. కానీ ఆమెకు తెలిసి సుబ్బారావుకీ, మృణాళిని భర్తకూ యెప్పుడూ గొడవలు జరగలేదు.

సుబ్బారావుకు మరో ముఖ్యస్నేహితుడు లక్ష్మీనారాయణ. ఆయన వయసులో సుబ్బారావు కంటె పదిహేనేళ్ళయినా పెద్దయి ఉంటాడు. ఆయన వసంతను చనువుగా అమ్మాయ్ అని పిలుస్తాడు. ఆయనకు వ్యాపారముంది. సుబ్బారావుతో ఆయన—"నువ్వెన్నేళ్ళుద్యోగం చేసినా ఇంతే! నీ తెలివితేటల్ని సైన్యమించి తప్పించి నాతో చేతులు కలుపు. ఏడాది తిరక్కుండా లక్షాధికారిని చేస్తాను...." అన్నాడు చాలాసార్లు. సుబ్బారావు నవ్వి ఊరుకుంటే—"నువ్వయినా చెప్పవమ్మా మీ ఆయనకి" అంటూండేవాడు. సుబ్బారావు తన మాటలు వినడంలేదని ఆయనకు కోపంగా ఉండేది. వసంత ఆయన గురించి సుబ్బారావు నడిగితే—"మనిషలా కనిపించినా ప్రమాదకరమైనవాడు. ఆయనతో మూరంగా ఉన్నంత కాలమే స్నేహం. కాస్త దగ్గరయ్యామంటే మనం ఫినిష్—" అని తన అభిప్రాయం చెప్పాడతడు. కానీ సుబ్బారావు మరణానికి పదిరోజులకి ముందు లక్ష్మీనారాయణ అతణ్ణెంతగానో మెచ్చుకుని—"నీ సలహాలవల్ల నాకు లక్షల్లో

లాభించింది. చాలా థాంక్స్—వారంరోజుల్లో నువ్వు నాతో జాయినయ్యావా సరే—లేకుంటే నిన్ను పైసాకి మాత్రం మిగలనివ్వను—" అన్నాడు. ఆయన వెళ్ళిపోయాక సుబ్బారావు—"లక్ష్మీనారాయణగారు నా గురించి సీరియస్‌గానే ఉన్నారు. నేనూ సీరియస్‌గా ఆలోచించాలి—" అన్నాడు.

"మీ రాయనకు నిజంగా సలహా నిచ్చేరా?"

"ఇచ్చాను—నెల్లాళ్ళ క్రితం. ఆయన చెప్పింది విని—సలహా ఇమ్మని బలవంత పెడుతూంటే—నాకు తోచింది చెప్పాను. అందువల్ల నిజంగానే లక్షల్లో లాభించిందంటే నా కాశ్చర్యంగా ఉంది. ఆయన మాటలు నమ్మతగ్గవిగా లేవు...."

"మీ కాయన అబద్ధమెందుకు చెబుతాడు?"

"ఎందుకంటే నాలో నా శక్తిమీద నమ్మకం పెరగాలి. ఆశ పుట్టాలి. అందుకోసం నాకు లేని తెలివినీ, శక్తినీ అంటగట్టవచ్చు. నన్ను తన పార్ట్నర్‌గా చేసుకోవాలని ఆయన కోరిక...."

"ఎందుకు? ఆయనకు వేరే మనుషులు దొరకరా?—...."

"దొరుకుతారు. కానీ నిజాయితీపరులు కావాలాయనకు. తెలివితేటలు, చురుకుతనం, వ్యాపారదక్షత ఉన్న నాలాంటి మొహమాటస్థు లాయన కాదర్శం. ఆయన పదిలక్షలు లాభం తీసి నా వాటాకు లక్ష రూపాయలే యిచ్చినా నాకది తృప్తినీ యిస్తుంది—ప్రతిఘటించాలనీ అనిపించదు. అందుకే ఆయన నా కోసం చూస్తున్నాడు—"

"మీ గురించి ఆయనకెలా తెలుసు?"

"అదే వ్యాపార లక్షణం. ఆయనకు నా గురించి— నీ కంటే యెక్కువ తెలుసు—...." అన్నాడు సుబ్బారావు.

"అయితే ఆయనతో కలిస్తే ఏం?"

"కలవచ్చు. కానీ నాది సైన్సు బుర్ర. నాకు సైన్సుతోనే ముడిశేసి ఉండాలనుంది. డబ్బుకోసం సైన్సు వదిలిపెట్టలేను—" అన్నాడు సుబ్బారావు.

డిటెక్టివ్ వెంకన్న ఆ కాగితాలు చదివి తెలుసుకున్న విశేషాలివి. దాన్నిబట్టి అతడికి కొన్ని విషయాలు అర్థమయ్యాయి.

సుబ్బారావు తన ఉద్యోగానికి అంకితమైన మనిషి. డబ్బు కూడా అతణ్ణి ఉద్యోగం నుంచి వేరుచేయలేదు. పరిశోధనల ద్వారా అతడంతో యింతో పేరు గడించాడు. ఎవరయినా డబ్బాశ పెట్టి అతడి పరిశోధనలను వక్రమార్గం పట్టించాలనుకుంటే అతడంగీకరించే తరహా కాదు.

ప్రవీణ్‌కుమార్‌కి అతడి పరిశోధనలపై ఆసక్తి ఉంది. అతడెవరో—ఎలాంటివాడో తెలుసుకోవాలి. అతడికి సుబ్బారావును హత్యచేసే అవకాశముంది. సుబ్బారావు కనిపెట్టిన విశేషంవల్ల అతడేదో ప్రయోజనం పొందాడని వసంత చెబుతోంది. ముందుగా అదేమిటో తెలుసుకోవాలి.

రెండు మృణాళిని. ఆమె మాటలను వసంత సీరియస్‌గా తీసుకోకపోయి ఉండవచ్చు. కానీ మృణాళిని తెలివైనది కావచ్చు. తన మాటలను వసంత భర్తకు చేరవేస్తుందని ఆమెకు తెలుసు. అందువల్ల సుబ్బారావుకు తనపై ఆకర్షణ పుట్టవచ్చుననీ ఆమెకు తెలుసు. సుబ్బారావు భార్యవద్ద

విషయాన్ని తేలికగా తీసుకున్నట్లు నటించినా—అతడు మృణాళినికోసం ప్రయత్నించి ఉండవచ్చు. ఆ ప్రయత్నాలనామె భర్త తెలుసుకుని ఉంటే—అంతే సంగతులు! సుబ్బారావు మృణాళిని భర్త గురించి కొంత సమాచారం సేకరించి ఉంచాడు. మృణాళిని భర్త కతణ్ని హత్యచేసే అవకాశముంది.

ఇక మిగిలింది లక్ష్మీనారాయణ. బిజినెస్ పార్ట్నర్ గా చేరనంత మాత్రాన ఏ వ్యాపారస్థుడూ—ఒక వ్యక్తిని హత్య చేయాలనుకోడు. లక్ష్మీనారాయణ సుబ్బారావును హత్య చేయాలనుకుంటే అందుకింకా బలమైన కారణం మరేదో ఉండివుంటుంది. అదేమిటో తెలుసుకోవాలి.

మొత్తంమీద సుబ్బారావు—చిత్రమైన మనిషిలాగే ఉన్నాడు. అతడు శ్రద్ధగా పరిశోధనలు చేస్తున్నాడు. అమ్మాయిల నాకర్షిస్తున్నాడు. వ్యాపారుల నూరిస్తున్నాడు. వీటన్నింటినీ కలిపి చూస్తే!

"ఆఫీసులో—సుబ్బారావు శీలం గురించి విచారించాలి—" అనుకున్నాడు వెంకన్న.

4

సెంట్రల్ గవర్నమెంటు లాబరేటరీలో వెంకన్న అనుచరులు సేకరించిన సమాచారం ప్రకారం సుబ్బారావు ప్రవర్తన చిత్రమైనది. అతడిగురించి అందరూ తలో రకంగానూ చెప్పారు. కొందరతడు కోపిష్ఠి అన్నారు. కొందరతడు మహాశాంతపురుషుడన్నారు. కొంద రతడు గర్విష్ఠి అన్నారు. కొందరతడికున్న వినయం ఆదర్శప్రాయమన్నారు. కొందరతడు ముభావం మనిషంటే మరికొందరతడు వాగుడుకాయన్నారు. కొందరతడు భక్తిపరుడంటే మరికొందరతడు కలాసాపురుషుడన్నారు. ఎక్కువ

మంది అమ్మాయిలతడంటే సదభిప్రాయం వ్యక్తపరిస్తే ఇద్దరమ్మాయిలు మాత్రం మరోలా చెప్పారు. ఒకమ్మాయి తన కతడి చూపులు నచ్చవంది. మరో అమ్మాయి అతడు తన చేయి పట్టుకున్నాడని కూడా చెప్పింది.

ఈ సమాచారం సేకరించడానికి వెంకన్న అనుచరులు తమ తెలివితేటలుపయోగించాల్సి వచ్చింది. అందరూ అంత సులభంగా తమ భావాలు బైటపెట్టరు. అవతలి వ్యక్తి పోలీసుల మనిషి కాదన్న నమ్మకం వారిలో కలగాలి.

వెంకన్న వారినభినందించి బయటి సమాచారం కూడా సేకరించమన్నాడు.

అప్పటివరకూ అతడు సేకరించిన సమాచారంలో అతి ముఖ్యమైనది—సుబ్బారావు చనిపోయే ముందు—ఆఫీసులో అతణ్ని కలుసుకుందుకో బయటి వ్యక్తి వచ్చాడు. విజిటర్స్ బుక్‌లో అతడు తన పేరు శ్రీకాంత్ అని వ్రాశాడు. అతడు కలుసుకున్న సమయం మూడుగంటలు. ఆ సమయంలో అతడు సుబ్బారావుతో కలిసి టీ త్రాగాడు. టీ తాగేముందు శ్రీకాంత్—మధుమూర్తివద్ద పనిచేసే లాబొరేటరీ అసిస్టెంటు సుధాకర్‌ని కూడా కలుసుకున్నాడు.

వెంకన్న తన అనుచరులకు సూచనలిచ్చి—శ్రీకాంత్ వివరాలు సేకరించమన్నాడు.

వాళ్ళాపనిలో ఉండగా అతడు తనకు తెలిసిన సమాచారాన్ని మననం చేసుకోసాగాడు. దాన్నిబట్టి సుబ్బారావు గురించి వెంకన్న కొంత ఊహించాడు.

సుబ్బారావు చురుకయినవాడు. కులాసా పురుషుడు. అన్నింటికీ మించి ఎవరిదగ్గ రెలా మసలాలో తెలిసిన

శాస్యుడు. అతడి గురించి చెప్పినవారిలో అతణ్ని నిందించినవారు, అతడి గురించి చెడ్డగా చెప్పినవారు తక్కువ. కొందరతణ్ని ముభావంగా ఉంటాడన్నారు. కొందరు వాగుడుకాయన్నారు. అంటే సుబ్బారావందరి దగ్గరా అతిగా వాగడు కానీ బాగా వాగే అలవాటుంది.

ఇలాంటి వ్యక్తికి పెద్ద పెద్ద పరిచయాలుంటాయి. అంతా అతణ్ని ఉపయోగించాలనుకుంటారు. తన పరిశోధనల గురించి యితరులెవ్వరికీ చెప్పడని సుబ్బారావు భార్య వసంత అంది. కానీ అసలు విషయమామెకు తెలిసుండకపోవచ్చు. భార్యతో సైన్సు మాట్లాడే పెద్దమనిషి— మరెందరితోనో ఆ విషయం మాట్లాడుతూంటాడని ఊహించవచ్చు. మనిషి వాగుడుకాయ కాకుండా ఉండాలిగానీ— ఉంటే తన గురించి ప్రచారం చేసుకోకుండా ఉండలేడు. సుబ్బారావు తన పరిశోధనల గురించి ఇతరులతో మాట్లాడుతూంటాడనడానికి సాక్ష్యం— ప్రవీణ్‌కుమార్. ఆ ప్రవీణ్‌కుమారెవరో వసంతక్కూడా సరిగ్గా తెలియదు. అంటే వారిద్దరికీ పరిచయం ఇంటి బయటే జరిగుండాలి. ప్రవీణ్‌కుమార్ పేరుతో లేబరేటరీలో ఉద్యోగులెవ్వరూ లేరు. ప్రవీణ్‌కుమార్‌వంటి వారింకా యెందరున్నారో తెలుసుకోవాలి. అలాంటివారెవరో అతడినంతంచేసి ఉండాలి.

వెంకన్న ఇంత దీర్ఘంగా ఆలోచిస్తున్నాడంటే అందుక్కారణముంది. లాబరేటరీలో సుబ్బారావు చేస్తున్న ప్రయోగాల గురించి అతడు విచారించాడు. అవి చాలా మామూలు పరిశోధనలు. నేరస్థులతో పరిచయముండే పరిశోధనలు కావవి. నేరస్థులకు సంబంధించినవి కూడా కావు.

సుబ్బారావు ఆర్గానిక్ కెమిస్ట్రీలో డాక్టరేట్ తీసు కున్నాడు. అతడి పరిశోధన లెక్కువగా ఆల్కహాల్సుకు సంబంధించినవి. ఆల్కహాలు తయారీ, వాటి లక్షణాలు గురించి కొత్త విశేషాలనతడు ఇంటర్నేషనల్ జర్నల్స్‌లో తను కనిపెట్టిన విశేషాలు పబ్లిష్ చేశాడు. విశేషాలు కొత్తవే అయినా నేరస్థులకు పనికిరావు.

డిటెక్టివ్ వెంకన్న అనుమాన మేమంటే—సుబ్బా రావు తనకున్న పరిచయాల దృష్ట్యా ఇతరత్రా ప్రయో గాలు చేస్తున్నాడని! ఆ ప్రయోగాల నతడు ఆత్మతృప్తికో ధనాశతోనో చేస్తూండి ఉండవచ్చు. కానీ అతడి పరి చయాలకు కారణం—అతడి ఇతర పరిశోధనలే!

ఆ పరిశోధన లేమిటో తెలుసుకోవాలంటే అందుకు ప్రవీణ్‌కుమార్‌ను పట్టాలి. అతడెవరో—యెలాంటివాడో తెలుసుకోవాలి....

వెంకన్న అనుచరు లతడికి కార్యం సులభం చేశారు....

ఎక్స్-32 యే సమయంలో సుబ్బారావు శరీరంలో ప్రవేశించడాని కవకాశముందో ఆ సమయంలో ఆఫీసులో అతణ్ని కలుసుకున్న శ్రీకాంత్ అనే వ్యక్తికి పరిచయ స్థులో ప్రవీణ్‌కుమార్ అనే వ్యక్తి ఉన్నాడు. ఆ ప్రవీణ్‌కుమార్ చిరునామా కూడా యిప్పుడు తెలిసింది.

వెంకన్న ప్రవీణ్‌కుమార్ యింటికి స్వయంగా వెళ్లాడు. అది యిల్లు కాదు. చిన్న గది. ఓ మధ్య తరగతి గృహస్థు తనింటి వీధిగదిని నూర్రూపాయల కద్దెకిస్తే అందులో ఉంటున్నాడు ప్రవీణ్‌కుమార్. సమయానికి ప్రవీణ్‌కుమార్ ఊళ్ళో లేడు.

ఇంటాయన్ను వెంకన్న ప్రవీణ్‌కుమార్ గురించి

ప్రశ్నలు వేశాడు. ఇంటాయన అతడి గురించి వివరంగా చెప్పాడు—"కుర్రాడు చాలా బుద్ధిమంతుడనే చెప్పాలి. మా యింట్లో పెళ్ళీడొచ్చిన ఆడపిల్లలిద్దరున్నారు. వాళ్ళ వంక ఒక్కసారి కూడా కన్నెత్తయినా చూడలేదు. కానీ ...."

"ఊఁ. కానీ ...."

"అతడేం ఉద్యోగం చేస్తున్నాడో నాకు తెలియదు. రాత్రిళ్ళెక్కువగా యింట్లో వుండడు. టైము ప్రకారం ఆఫీసుకు వెళ్ళడం చూడలేదు. పగలు సాధారణంగా యింట్లోనే వుంటాడు. ఏం చేస్తాడో తెలియదింట్లో కూర్చుని. పనిమనిషి చెప్పిన ప్రకారం—ఇంట్లో బ్రాందీ, విస్కీ బాటిల్సున్నాయి. అంటే గదిలో తాగుతూంటా డనుకోవాలి...."

"మరలాంటి వాణ్నింట్లో ఎలా ఉండనిచ్చారు?"

"అలాంటివాడనుకునేందుకతడెప్పుడూ తప్పుగా ప్రవర్తించలేదు. బైటకు వస్తేచాలు-తలవంచుకునే వుంటాడు. ముఖ్యంగా ఆడవాళ్ళతో మాట్లాడేటప్పుడు...." అన్నాడు ఇంటాయన.

"అద్దె సక్రమంగా యిస్తాడా?"

"డబ్బు విషయంలో అతడినేమీ అనుకుందుకులేదు. అతడి వ్యవహారం చూసి నాకనుమానం వచ్చి—ఒక రోజున డబ్బప్పు కావాలన్నాను. అప్పుతీసుకుంటే అది అడ్వాన్సుగా ఉంచుకోవచ్చని నా ఆశ. ఎంత కావా లన్నాడతడు. వెయ్యిరూపాయలన్నాను. మర్నాటికిస్తా నన్నాడు. నిజంగానే యిచ్చేశాడు. నేను చాలా ఆశ్చర్య పడ్డాను. అంతేకాదు. ఆ తర్వాత నెల ఫస్టుతారీఖుకల్లా అద్దెడబ్బులిచ్చి—"అప్పు మీ వీలునుబట్టి తీర్చండి. నేను అద్దె

మామూలుగానే యిస్తుంటాను. రెండింటికీ లంకె పెట్టడం నాకిష్టముండదు—" అన్నాడు. ఇది జరిగి ఏడాది దాటింది. నేనింకా అతడికొరుకవందలు బాకీ—"

వెంకన్న ఆశ్చర్యంగా— "అతణ్ని మీరేం ఉద్యోగం చేస్తున్నాడో అడిగి తెలుసుకోలేదా?" అన్నాడు.

"ఎందుకు?" అన్నాడింటాయన.

"మన దేశంలో అది సహజం. ప్రవీణ్ కుమార్ మంచి పెళ్ళికొడుకు—"

ఇంటాయన మొహమాటంగా—"నిజం చెప్పాలంటే నేనతడి వివరాలు తెలుసుకుందుకు ప్రయత్నించాను. పేరు తప్ప ఇంకేమీ నిజం చెప్పడం లేదని నాకు తోచింది. ఒకటి రెండుసార్లతడి తలిదండ్రుల ప్రస్తావన తెచ్చి—పెళ్ళి చేయకుండా ఎందుకూరుకున్నారని—అడిగాను. బదులుగా అతడు తాను పెళ్ళి చేసుకోనన్నాడు...." అన్నాడు.

"ఎందుకట?"

"ఎందుకో తెలియదు కానీ అతడు పెళ్ళికి విముఖుడు. అతడికి తాగుడు అలవాటు బాగా వుందని రూఢి అయింది నాకు. కానీ దాంతో అతడెవర్నీ ఇబ్బంది పెట్టాడనుకోను. అతడి ఉద్యోగం కూడా—నలుగురూ చేసే పైపు కాదనిపించింది. ఎందుకో మా ఆవిడకతడు నచ్చలేదు. పెళ్ళికొడుకుల లిస్టులోంచి అతడి పేరు తీసేశాం...."

వెంకన్న ఇంటాయన్ను ప్రవీణ్ కుమారే వూరివాడో అడిగాడు.

"అతడి పేరే కానీ ఊరు తెలియదు నాకు—" అన్నాడింటాయన.

ఎప్పుడొస్తాడనడిగితే — వెళ్ళిన రోజే కానీ వచ్చేరోజు తెలియదన్నాడాయన. వెళ్ళిన రోజుకు సరిగ్గా మూడు రోజుల తర్వాత సుబ్బారావు చనిపోయాడు.

ఆ యింట్లో ప్రవీణ్‌కుమార్‌ని కలుసుకునేందుకు స్నేహితులు కానీ, బంధువులు కానీ రాలేదు.

వెంకన్న ఇంటాయనకు థాంక్స్ చెప్పి అక్కణ్ణుంచి బైటపడ్డాడు.

5

శ్రీకాంత్‌ను వెంకన్న స్వయంగా కలుసుకోలేదు. అయితే అతడి గురించిన విశేషాలు వెంకన్న నాశ్చర్య చకితుణ్ని చేశాయి.

శ్రీకాంత్ రాష్ట్ర ప్రభుత్వోద్యోగి. నెలకు పన్నెండు వందల జీతం. భార్య, యిద్దరు పిల్లలు. పిల్లలిద్దరూ మగాళ్ళు. శ్రీకాంత్ తలిదండ్రులు, అత్తమామలు — అత్యంత సామాన్యులు. శ్రీకాంత్ చేసే ఉద్యోగంలో లంచాలు దొరికే అవకాశం చాలా తక్కువ అనడం కంటే — లేదనడమే సరైన మాట.

అంతవరకూ బాగానే ఉంది.

శ్రీకాంత్ భార్య పండుగల్లో పట్టుచీరలు, ఎప్పుడు గార్డెన్ సిల్కు చీరలు కడుతుంది. వాళ్ళింట్లో పనిమనిషి, వంటమనిషి కూడా ఉన్నారు. శ్రీకాంత్ కొడుకులిద్దరికీ బంగారపు మురుగులున్నాయి. అతడింట్లో ఖరీదైన ఫర్నిచర్‌తోపాటు కలర్ టీవీ, వీసీఆర్ కూడా ఉన్నాయి.

శ్రీకాంత్ ఇంటద్దెగా ఎనిమిదివందలిస్తున్నాడు. అతడికి బజాజ్ చేతక్ స్కూటరుంది. కారు లేకపోవడం ఆశ్చర్యం.

అతడికి ఎక్కడిదింత డబ్బు?

శ్రీకాంత్ పై అవినీతి ఆరోపణలు లేవు. ఇన్ కం టాక్స్ డిపార్టుమెంట్ రెయిడ్స్ చేయలేదు. ఇంకా చెప్పాలంటే అతడు కొన్న ప్రతి వస్తువూ ఆఫీసులో డిక్లేర్ చేయబడింది. చాలా వస్తువులతడు తలిదండ్రులు, అత్తమామల నుంచి గిఫ్టుగా పొందినట్లు ప్రకటించాడు. గిఫ్టు టాక్స్ ఆయా వస్తువులకు సక్రమంగా పే చేయబడింది.

శ్రీకాంత్ భార్య చాలామందికి ప్రయివేట్లు చెప్పి డబ్బు సంపాదిస్తోందని అతడాఫీసులో డిక్లేర్ చేశాడు. ఆ ఆదాయమెప్పుడూ ఇన్ కంటాక్స్ పరిమితులకు లోబడే ఉంటోంది.

అతడుండే వీధిలో వాకబుచేయగా శ్రీకాంత్ భార్య యెవరికీ ప్రయివేట్లు చెప్పడంలేదని తెలిసింది. లోతుగా వాకబు చేయగా శ్రీకాంత్ కి చాలా పెద్ద పరిచయాలున్నాయనీ—ఆ పలుకుబడితో తమ వీధిలోని వారందరికీ సహకరించడంవల్ల—అందరూ అతణ్ణభిమానిస్తారే తప్ప-అతణ్ని చూసి అసూయపడడంలేదనీ అర్థమయింది.

వెంకన్న శ్రీకాంత్ గురించి బాగా ఆలోచించాడు.

సుబ్బారావు హత్యకేసు—సరైన దారిలోనే వెడుతోందనిపించిందతడికి.

వెంకన్న అనుమానిస్తున్న ప్రకారం సుబ్బారావు పరిశోధన సంఘవిద్రోహకర శక్తులకు సహకరించాల్సి వుంది. అలా జరక్కపోవడంతో వాళ్ళు సుబ్బారావును హత్య చేయాలనుకున్నారు. శ్రీకాంత్ సంఘవిద్రోహకర

శ త్రు ల తో చేతులుకలిపాడనడానికి సందేహంలేదు. అతడు అక్రమంగా ధనం సంపాదిస్తున్నాడు.

సుబ్బారావును శ్రీకాంత్ కలుసుకున్నాడు. బహుశా అతడే ఎక్స్-32 ను సుబ్బారావు శరీరంలో ప్రవేశపెట్టి ఉండవచ్చు. ఇద్దరూ కలిసి టీ తాగారు. డాక్టరు చెప్పిన సమయం, వారిద్దరూ కలిసి టీ తాగిన సమయం ఒక్కటే!

ఎక్స్-32 శ్రీకాంత్ కి అందుబాటులో లేదు. అది సుధాకర్ కీ, మధుమూర్తికీ అందుబాటులో వుంది. శ్రీకాంత్ సుబ్బారావును కలుసుకునే ముందు సుధాకర్ని కలుసుకున్నాడు.

ఏం జరుగుతుందీ యెలా జరిగుతుందీ డిటెక్టివ్ వెంకన్న ఊహించగలుగుతున్నాడు. కానీ ఎందుకు జరిగిందీ తెలిసేవరకూ అతడి ఊహకు విలువ, అర్థం—వుండవు.

6

"మీ పరిశోధన లెంతవరకూ వచ్చాయి?" అన్నాడిన స్పెక్టర్ శంకర్రావు కుతూహలంగా.

"మీ పోలీసులెంత దాకా పయనించారో ముందు నేను తెలుసుకోవాలి—" అన్నాడు వెంకన్న.

శంకర్రావతడికి శ్రీకాంత్ గురించి చెప్పాడు. పోలీసులు తెలుసుకున్న వివరాలకంటె వెంకన్న అనుచరులు సేకరించిన సమాచారమే ఎక్కువ. వెంకన్న అతడికి తన పరిశోధనల వివరాలన్నీ చెప్పి—"మీ పరిశోధనలో మీ కెక్కడా ప్రవీణ్ కుమార్ తగిలినట్లు లేదు. ఈ కేసులింకంతా శ్రీకాంత్, ప్రవీణ్ కుమార్ లలో వుంది—" అన్నాడు.

"అంతేనా—మరి మృణాళిని, లక్ష్మీనారాయణల

సంగతేమిటి?" అన్నాడు శంకర్రావు.

"మృణాళినిని రెండుమూడుసార్లు—ఇంటిదగ్గర కలుసు కున్నాడు సుబ్బారావు. ఆ విషయం అతడి భార్యకు తెలియదు. మృణాళిని భర్తకూ తెలియదని నా నమ్మకం. మృణాళిని భర్త నెలరోజులుగా ఊళ్ళోలేడు. ఆఫీసు పనిమీద అతడు ఢిల్లీకి లాంగ్ టూర్‌మీద వెళ్ళాడు. ఇంకా రాలేదు. ఇక లక్ష్మీనారాయణ సంగతి తీసుకుంటే ఆయన సీదాసాదా వ్యాపారస్థుడిలాగే వున్నాడు. ఆయనకు సుబ్బారావంటే వాత్సల్యమున్నట్లు కనబడు తుంది—...." అన్నాడు వెంకన్న.

"మీరు కాదంటే సరేగానీ—మీరు చెప్పిన కార ణాలు నాకంత సబబుగా అనిపించలేదు...."

"శంకర్రావుగారూ! ఎవరైనా హత్యచేయడాని కొకోసారి చిన్న కారణం సరిపోవచ్చు. కానీ ప్రతి చిన్న కారణానికీ హత్యలు జరుగుతాయంటే — ఈ ప్రపం చంలో జనాభా మిగలరు—" అన్నాడు వెంకన్న.

"నేను శ్రీకాంత్ గురించి చాలా ఆచూకీలు తీశాను. అతడు దళారీలాంటి వాడు. ఎక్కడా తన ప్రమేయం లేకుండా తెలివిగా వ్యవహరిస్తున్నాడు. నా అనుమానం అతడు రహస్య సమాచారాన్ని సేకరించి—పెద్దమనుషుల కమ్ముతున్నాడని...."

"కరెక్ట్....బాగా తెలుసుకున్నారు....ఇక మీరు ప్రవీణ్‌కుమార్ గురించి తెలుసుకోవాలి. అతడు పరారీలో ఉన్నాడని నా అనుమానం. మీరు దేశంలోని వివిధ పోలీసుస్టేషన్లకతడి గురించి హెచ్చరిక పంపండి..."

"ఒక చిన్న హత్యకేసులో సాధారణమైన అను మానంమీద అతడి గురించి ఇంత పెద్ద చర్య తీసు

కోరడం సబబు కాదేమో!"

"శంకర్రావుగారూ! ఇది చిన్న హత్యకేసు కాదు. ప్రవీణ్ కుమార్ వివరాలు తెలిసేదాకా — ఇదెంత ప్రమాదకరమైనదో అంచనా కూడా వేయలేం...."

"సరే — పై ఆఫీసర్లతో మాట్లాడి చూస్తాను...." అన్నాడు శంకర్రావు.

అక్కణ్నించి వెంకన్న ఇంటికి వెళ్ళేసరికో వార్త అతడికోసం యెదురు చూస్తోంది.

పోస్టుమార్టం జరిగిన వెంటనే శవాన్ని బంధువుల కప్పగించడం జరిగింది. సుబ్బారావు తలిదండ్రులు వసంతను శాపనార్థాలు పెట్టారు. వసంత తలిదండ్రులు ఆమెనింటికి తీసుకుని వెడతానన్నారు. వెంకన్న వారితో "సుబ్బారావు హత్యచేయబడ్డాడు. ఇందులో దేశ ద్రోహుల కుట్ర ఉందని నా అనుమానం. వారిని బైట పెట్టేవరకూ ఆమెను మా యింటనే ఉండనివ్వండి. ఆమె ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయి. మా యింటనే గానీ మీ యింట ఆమెకు రక్షణ ఉండదు...." అన్నాడు.

నిజానికి వసంత ప్రాణాలు ప్రమాదంలో ఉన్నదీ లేనిదీ వెంకన్నకు తెలియదు. సుబ్బారావు కేసు చాలా చిత్రంగా ఉంది. అతడు హత్యచేయబడ్డానికి కారణం దొరికేవరకూ ఆమెను వెంకన్న తనింట్లోనే ఉంచుకోవాలని సంకల్పించాడు. అందుకు వసంత తలిదండ్రులూ అంగీకరించారు. వసంత కూడా ఒప్పుకుంది.

ఆరోజు వసంతకోసం రామ్మూర్తి వచ్చాడు. రామ్మూర్తి యువకుడు. సుబ్బారావు స్నేహితుడు. వసంత అతణ్ని కలుసుకోవడానికి నిరాకరించింది. సీతమ్మ, రాజమ్మ రామ్మూర్తిని చాలా ప్రశ్నలు వేశారు.

"నేను బ్రహ్మచారిని. వసంత అందం నన్నాకర్షించింది. ఆ మైకంలో నాకేమీ తెలియలేదు. సుబ్బారావు నాకు మంచి స్నేహితుడన్న విషయం కూడా విస్మరించి ఆమెకు దగ్గర కావాలని ప్రయత్నించాను. ఆరంభంలో ఆమె ప్రతిఘటించింది. క్రమంగా నా ఆకర్షణకు లొంగిపోయింది. మా యిద్దరిమధ్యా నడిచే వ్యవహారం చాలాకాలం రహస్యంగానే జరిగింది. కొన్నాళ్ళ క్రితం మేమిద్దరం రెడ్ హేండెడ్ గా సుబ్బారావుకు పట్టుబడ్డాం. అతడు చాలా అప్సెట్టయ్యాడు. నన్నేమీ అనలేదు, భార్యను కూడా ఏమీ అనలేదని తెలిసింది నాకు. నేనతడికి ముఖం చూపించలేకపోయాను. జరిగిందానికి క్షమార్పణ చెప్పుకోవాలనుకున్నాను. కానీ ఈలోగానే అతడాత్మహత్య చేసుకున్నాడు. వసంతపట్ల నాకూ కొంత బాధ్యత వుంది. ఆమెకు ధైర్యం చెప్పడానికి వచ్చాను. ఆమెను వివాహం చేసుకుని చేయూతనివ్వడానికి సిద్ధంగా ఉన్నాను నేను. కానీ ఆమెకు నామీద కోపంగా ఉంది. ఇందులో తప్పు నా ఒక్కడిదే కాదు. మా యిద్దరిదీను. నా తప్పును నేను సవరించుకునేందుకు సిద్ధంగా ఉన్నాను.." అన్నాడు రామ్మూర్తి.

అతడు వెళ్ళిపోయాక సీతమ్మ, రాజమ్మ అతడేమన్నదీ—వసంతకు చేరవేశారు. వసంత కళ్ళెర్రబడ్డాయి.

"వాడు నరరూప రాక్షసుడు. కామపిశాచి. స్నేహితుడి భార్యనని తెలిసీ నన్ను కామించాడు. నేను వారికి ఫిర్యాదు చేశాను. వారు వాణ్ని మందలించారు. అప్పుడు వాడు తప్పంతా నాదే అన్నట్లు వారితో మాట్లాడేడు. నా ప్రవర్తన గురించి అబద్ధాలు చెప్పాడు. వారు మంచివారు. వాడి అబద్ధాలు నమ్మలేదు. వాడిని కోప్పడి మళ్ళీ

తనకు ముఖం చూపవద్దన్నారు. వాడు నా గురించి చెప్పిన మాటలన్నీ చెప్పి—"అవి నేను నమ్మడంలేదు. నువ్వు నా దానివి. నేను నీ మాటలే నమ్ముతాను. ఒకవేళ వాడు నిజమే చెప్పినా సరే—అది గతం. నా కా గతంతో నిమిత్తంలేదు—" అన్నారు. అంత మంచివారు వారు—...." అందామె.

వసంత అభిప్రాయంలో—వాడిప్పు డవకాశం దొరికింది కదా అని ఆమెను దక్కించుకోవాలనుకుంటున్నాడు.

ఈ సమాచారం విన్న వెంకన్న ఆలోచనలో పడిపోయాడు.

రామ్మూర్తి విషయాన్ని వసంత ఇంతకాలమూ బైట పెట్టలేదు. కేసులో చాలా పెద్ద మిస్సింగు లింకు. తనకు తానే బయట పడ్డాడు కాబట్టి కానీ రామ్మూర్తి గురించి తెలుసుకోవడం తమకు సాధ్యపడేది కాదు.

రామ్మూర్తికీ వసంతకూ మధ్య యేదో వ్యవహారం నడిచింది. అది సుబ్బారావుకి తెలిసింది. ఆ తర్వాత సుబ్బారావు మరణించాడు. అది హత్యయితే వసంత,రామ్మూర్తి కలిసి చేసి వుండవచ్చు. ఎక్స్-32 గురించి వసంత రామ్మూర్తికి చెప్పివుండవచ్చు. తన పరిశోధనల గురించి అన్నీ చెబుతూండే సుబ్బారావు భార్యకు లాబొరేటరీలో యితర విశేషాలు చెప్పడనుకుందుకు లేదు. ఆమెకు ఎక్స్-32 గురించి తెలిసే వుంటుంది.

లేదా వసంత నిర్దోషి. కానీ సుబ్బారావు రామ్మూర్తి మాటలు నమ్మాడు. నమ్మలేదని భార్యకబద్ధం చెప్పాడు. మానసికంగా బాధపడుతూ తట్టుకోలేక ఒకరోజున ఆత్మహత్య చేసుకున్నాడు.

అయితే ఎక్స్-32 అతడిదాకా ఎలా వచ్చింది? అతడి ప్రయోగాల్లో ఎక్కడా ఎక్స్-32 అవసరమున్నట్లు లేదు. అతడు ఎక్స్-32 తననుంచి తీసుకున్నట్లు సైంటిస్టు మధు మూర్తికూడా చెప్పలేదు.

అప్పుడు వెంకన్నకు స్ఫురించింది—సుబ్బారావుకు డైరీ వ్రాసే అలవాటు గనుక ఉన్నట్లయితే—అది చూడాలి! అందులో చాలా విశేషాలు బయటపడవచ్చు. కానీ వసంత అతడికి డైరీ రాసే అలవాటు లేదని చెప్పినట్లు గుర్తు.

వెంకన్న వెంటనే వసంతను కలుసుకుని రామ్మూర్తి విషయమడిగి—"నువ్వు మొదట ఈ రామ్మూర్తి వ్యవహారం బయటపెట్టకపోవడంవల్ల — నిన్నిప్పుడనుమానించక తప్పదు. నీ నిజాయితీని నీ భర్త ఒక్కడే నిరూపించగలడు. లేదా అతడి డైరీ నిరూపించగలదు. దురదృష్టవశాత్తూ అతడికి డైరీ రాసే అలవాటు లేదు—" అన్నాడు.

"వెంకన్నగారూ! ఇబ్బందికరమైన విశేషాలు దాచిపెట్టిన మాట నిజం. మావారు డైరీలో ఉన్నదున్నట్లు రాస్తారు. అందులో మా యిద్దరికీ సంబంధించిన వ్యక్తిగతానుభవాలు కూడా వివరంగా వున్నాయి. అందుకే దాని గురించి అబద్ధం చెప్పాను. వారు డైరీ రాస్తారు. ఆ డైరీ నా నిజాయితీని ఋజువు చేస్తుంది—...." అంది వసంత.

కేసిలా మలుపులిరిగినందుకు వెంకన్న ఆశ్చర్యపడ్డాడు. సంతోషపడ్డాడు. మనసులోనే రామ్మూర్తి నభినందించుకున్నాడు.

మరి కాసేపట్లో సుబ్బారావు డైరీ వెంకన్న చేతికి

వచ్చింది. వెంకన్న ఆ డైరీ చదివాడు. చదివినందుకు తర్వాత అతడు బాధపడ్డాడు కూడా. అందులో భార్యా భర్తలకు సంబంధించిన ప్రయివేటు విషయాలు చాలా యెక్కువగా వున్నాయి. అందులో రామ్మూర్తి ప్రస్తావన వుంది. సుబ్బారావు రామ్మూర్తిని అసహ్యించుకున్నాడు. రామ్మూర్తివంటి స్నేహితుడి నింటికి రానిచ్చి భార్యను బాధ పెట్టానని వ్యధ చెందాడు. మళ్ళీ తమ ఇంటికి వస్తే యే కాఫీలోనో స్లోపాయిజనిస్తానని భయపెట్టి అతడితో తెగ తెంపులు చేసుకున్నాడు.

విశేషమేమిటంటే అందులో ఎక్కడా ప్రవీణ్ కుమార్ ప్రసక్తిలేదు. డైరీ నిండా—అతడికీ భార్యకూ సంబంధించిన విశేషాలే వున్నాయి.

వెంకన్న డైరీని వసంతకు తిరిగిచ్చేసి — "నీవు చెప్పింది నిజం. రామ్మూర్తి నీ గురించి అబద్ధం చెప్పాడు. నేనతడి అంతు చూస్తాను. మీ వ్యక్తిగతానుభవాలకు సంబంధించిన ఈ డైరీని చదివినందుకు మన్నించు—" అన్నాడు.

వసంత తల వంచుకుని—"వారీ డైరీని నా కోసమే రాసేవారు. నా గురించి తనకు కలిగే భావాలన్నీ డైరీలో వ్రాసి—దీన్ని నీ వెప్పుడయినా చదువుకోవచ్చు—.... అనేవారు. అందులో మాకు సంబంధించి తప్ప మరేమీ వుండదు—అందుకే నేను దీని గురించి ముందుగా మీకు చెప్పలేదు—" అంది.

అర్థమయింది వెంకన్నకు. సుబ్బారావు భార్యను సంతోష పెట్టడానికి మాత్రమే డైరీ వ్రాసేవాడన్న మాట!

వెంకన్న డైరీ గురించి యింకా ఆలోచిస్తూండగా నే

బయట్నుంచి ఫోన్ వచ్చింది.

"హలో!" అన్నాడు వెంకన్న.

"నేను శంకర్రావుని మాట్లాడుతున్నాను. మాట్లాడుతున్నది వెంకన్నగారే కదూ!"

"అవును—ఏమిటి విశేషం!"

"ప్రవీణ్ కుమార్ గురించిన వివరాలు తెలిశాయి. అతడు నేరస్తుడు కావటానికి వీల్లేదు. ప్రభుత్వ గూఢచారి శాఖకు చెందిన వ్యక్తి.... ఇప్పుడీ ఊళ్ళో అతడి మిషన్ అయిపోయింది. అతణ్ని ట్రేస్ చేయడం కూడా కష్టం...."

"వాట్...." అన్నాడు వెంకన్న.

7

వెంకన్న రామ్మూర్తి గురించి వాకబు చేశాడు. రామ్మూర్తిలో పెద్దగా విశేషాలేమీ లేవు. కానీ అతడికి శ్రీకాంత్ కి పరిచయముంది.

"శ్రీకాంత్ తోనే ఈ కేసు లింకంతా ఉంది—" అనుకున్నాడు వెంకన్న. కానీ ఆ లింకును సాధించడమెలా?

వెంకన్న బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. అతడు లాబొరేటరీ అసిస్టెంటు సుధాకర్ ని స్వయంగా కలుసుకుని—"నువ్వు ఎక్స్-32 ని వేరే కాగితంలో వేసి పొట్లాం కట్టడం చూసినవాళ్ళున్నారు. ఆ సాక్ష్యం నిన్ను హంతకుణ్ని చేస్తుంది. నిజం చెబితే నిన్ను రక్షించగలను. లేదా—నీ కర్మ!" అన్నాడు.

సుధాకర్ భయపడ్డాడు—"నేనలాంటి పని చేయలేదు. మీ కెవరో అబద్ధం చెప్పారు—...." అన్నాడతడు.

"సరే—అయితే నీకేమయినా ఆస్తి పాస్తులుంటే త్వరగా వీలునామా వ్రాసుకో! సుబ్బారావు డైరీలో నీవు ఎక్స్-82 దొంగతనం చేస్తూండగా చూసినట్లు రాసుకున్నాడు. అదికాక బ్రతికున్నవారి సాక్ష్యం కూడా వుంది— ...."

సుధాకర్ క్షణం తటపటాయించి—"వెంకన్నగారూ! నేను ఎక్స్-82 కొద్దిగా తీసుకున్న మాట నిజం. కానీ నా కోసం కాదు. నేను దాన్ని వాడలేదు....—" అన్నాడు.

"మరి?"

"శ్రీకాంత్ కిచ్చాను...."

"శ్రీకాంత్ కీ నీకూ సంబంధమేమిటి?"

సుధాకర్ బయటపెట్టిన నిజం వెంకన్న నాశ్చర్య చకితుణ్ని చేసింది.

శ్రీకాంత్ దగ్గర రకరకాల మద్యాలున్నాయి. వాటిలో కొన్ని నూరేళ్ళ నాటివి. వాటి రుచి మద్యం తాగేవాడికే తప్ప తెలియదు. ఒకసారి వాటిని మరిగిన వాడు—ఆ రుచి మరిగి వాటికోసం యేమైనా చేయగల్గుతాడు. శ్రీకాంత్ స్నేహితులందరూ అతడిచుట్టూ తిరిగేది వాటికోసమే! అతడు వారిని బాగా తాగించి తన కావలసిన రహస్యాలు రాబడుతూంటాడు. తనకా-వలసిన పనులు చేయించుకుంటాడు.

"శ్రీకాంత్ కీ సుబ్బారావుకీ సంబంధమేమిటి?"

"నాకు తెలిసి యే సంబంధమూ లేదు. ఒకరోజాయన సుబ్బారావుగారిని కలుసుకుందుకు వచ్చాడు. అప్పుడే నా దగ్గర ఎక్స్-82 తీసుకున్నాడు. ఆ రాత్రే సుబ్బారావు గారు చనిపోయాడు. ఇంతకు మించి నా కేమీ తెలి

యాడు___ ."

"చూడు....నీ సాక్ష్యం చాలా అవసరం. నిన్ను రక్షించుకుందుకే కాదు. ఓ భయంకర నేరస్థుణ్ని బయట పెట్టడానికి...."

సుధాకర్ భయంగా—"నన్ను బయటకు లాగకండి. శ్రీకాంత్ సామాన్యుడు కాదు. అతడికి పెద్దవాళ్ళ అండ వుంది. అతడికి వ్యతిరేకంగా సాక్ష్యమిస్తే బహుశా నేను, నా కుటుంబం సర్వనాశనమయిపోతాం___...." అన్నాడు.

"అలా జరగదని నేను హామీ యిస్తున్నాను___...." అన్నాడు వెంకన్న. అతడి కిప్పుడెంతో సంతోషంగా వుంది. సుధాకర్ మీద ఓ అస్త్రం వేసిచూస్తే ఫలించింది. అప్పుడప్పుడిలాంటి అదృష్టముంటే తప్ప కేసులు పరిష్కారం కావు.

వెంకన్న తర్వాత రామ్మూర్తిని కలుసుకుని___"నువ్వు వసంతకోసం సుబ్బారావుని చంపేశావనడానికి ఆధారాలున్నాయి. లాబొరేటరీలో ఓ వ్యక్తి నీకు ఎక్స్-32 విషాన్ని ఇచ్చాడని సాక్ష్యం చెప్పాడు. సుబ్బారావు ఎక్స్_32 విషంతోనే చనిపోయాడు. నువ్వు నా యింట్లో వున్న వసంతను బెదిరించడం కారణంగా కేసు నీకు వ్యతిరేకంగా బలపడింది. సుబ్బారావు డైరీ వసంత నిర్దోషిత్వాన్ని బయట పెట్టింది...." అన్నాడు.

రామ్మూర్తి భయపడ్డాడు. అతడు వెంటనే—"నాకేం తెలియదు. నేను హత్యలు చేసే రకంకాదు. సామాన్యుణ్ని—" అన్నాడు.

"హత్యలు కాంతాకనకాలకోసం జరుగుతాయి. కాంత ఉండనే ఉంది కారణమిక్కడ...." అన్నాడు

వెంకన్న.

వెంకన్న బెదిరింపుకు రామ్మూర్తి భయపడ్డాడు. అతడు వెంటనే—"నా బుద్ధి మంచిదికాదు. అందమైన ఆడపిల్లల వెంటపడడం నా అలవాటు. చాలామంది నాకు లొంగిపోవడంవల్ల నా ధైర్యం పెరిగింది. వసంత చేతిలో నేను పరాభవం చెందాను. అంతటితో ఆమెను మర్చిపోవాలనుకున్నాను. కానీ శ్రీకాంత్ నన్నుపయోగించుకోవాలనుకున్నాడు. సుబ్బారావు హత్య కేసుకో కొత్త మలుపు తేవాలనుకున్నాడతడు. అనుమానం వసంతమీదకే మళ్ళించాలని అతడి ఆశయం. గతంలో పరాభవంచెంది ఉన్న మూలాన నేనూ అందుకంగీకరించాను" అన్నాడు.

"మరి—అందువల్ల నువ్వు ప్రమాదంలో పడతావనీ—హత్య కేసులో ఇరుక్కుంటాననీ భయపడలేదా?" అన్నాడు వెంకన్న.

"శ్రీకాంత్ నాకు హామీ యిచ్చాడు...."

"హామీని నమ్మి—ప్రాణాల మీదకు తెచ్చుకున్నావంటే నమ్మశక్యంకాదు. నువ్వు నిజంగా సుబ్బారావుని హత్యచేశావు...."

శ్రీకాంత్ గురించి సుధాకర్ చెప్పిన నిజాన్నే రామ్మూర్తి కూడా చెప్పడానికెంతోసేపు పట్టలేదు. రామ్మూర్తి మద్యం రుచిమరిగి శ్రీకాంత్ చెప్పినట్లు విన్నాడు. ఆ మద్యం రుచి అలాంటిది!

వెంకన్న సరాసరి శ్రీకాంత్‌ని కలుసుకున్నాడు.

"నగరంలో పలువురిని మత్తు పదార్థాల కలవాటు చేస్తున్నారని మీమీద ఆరోపణలున్నాయి. అందుకు ఋజువులు, సాక్ష్యాలు ఉన్నాయి—" అన్నాడు

వెంకన్న.

శ్రీకాంత్ చలించలేదు—"మత్తు పదార్థాల గురించిన మీ ఆరోపణ తప్పు. నా దగ్గర పాతకాలంనాటి విదేశీ మద్యాలున్నాయి. మద్యం అలవాటైన వారికి తప్ప వాటి రుచి అర్థంకాదు. అందులో యేవిధమైన మత్తు పదార్థాలు కలుపబడలేదు. ఆ మద్యాలకోసమే చాలా మంది నాతో స్నేహంచేస్తున్నారు. ఆ మద్యాలను నేనేమీ రహస్యంగా దాచలేదు. వాటి శాంపుల్స్—ఎప్పుడైనా యెవరైనా పరీక్షించవచ్చు. నేను నా స్నేహితులతో మద్యం తీసుకునే సమయంలో కూడా యెవరైనా వచ్చి—మేము పుచ్చుకునే మద్యాన్ని పరీక్షించుకోవచ్చు—" అన్నాడు ధైర్యంగా.

వెంకన్న మద్యం శాంపిల్స్ తీసుకున్నాడు శ్రీకాంత్ వద్ద వాటిలో యేవిధమైన మత్తుపదార్థాలూ కలవలేదని అతడికి రుజువయింది. మరి?

శ్రీకాంత్ సుబ్బారావుని హత్యచేయడానికి కారణమేమిటి? అది తెలిసేదాకా తను శ్రీకాంత్ నేమీ చేయ లేడు.

అయితే వెంకన్న అట్టే శ్రమపడకుండానే కారణమతణ్ణి వెతుక్కుంటూ వచ్చింది — రిజిస్టర్డు లెటరు రూపంలో!

ఉత్తరం ప్రవీణ్ కుమార్నించి—సుబ్బారావుకి!

ప్రవీణ్ కుమార్ పేరిటవచ్చే ఉత్తరాలన్నీ తనింట్లో డెలివరీ చేయించే ఏర్పాటు చేశాడు వెంకన్న.

ఉత్తరంలో—

"డియర్ సుబ్బారావు!

నేను మద్యానికి దాసుడినన్న కిటుకు శ్రీకాంత్

పట్టేవాడు. నా నుంచి రహస్యాలు లాగడానికి కతడు నన్ను వాళ్ళింటికి పిలిచేవాడు. నేను మోసం గ్రహించడానికి కొంతకాలం పట్టింది. శ్రీకాంత్ ననుమానించేక చేసేదేముంది? మద్యం నా బలహీనత. ఆ బలహీనతను జయించకపోతే - నా వృత్తికి న్యాయం చేకూర్చలేను. నీకా విషయం చెబితే నువ్వు నాకోసం ప్రత్యేక పరిశోధనలు కావించావు!

అసలు ఆల్కహాల్సుకి సంబంధించిన నీ పరిశోధనల వివరాలు పేపర్లో రాబట్టి నాకు నీ గురించి తెలిసింది. మద్యం పుచ్చుకునేవాడు—ఆ రుచిని ఎంజాయ్ చేస్తూ తన్ను తాను మరిచిపోకుండా ఉండడానికి బెంజాయిడ్, అజిపిన్స్, వాలియం, లిబ్రియమ్‌ల నుంచి లభించే కొన్ని డ్రగ్సు సాయపడతాయనీ — వీటిపై లోతుగా పరిశోధించడానికి భయపడుతున్నట్లూ ఒక సైంటిఫిక్ మాగజైన్లో వ్రాశావు. కారణం-నీ పరిశోధన మద్యపానాన్ని ప్రోత్సహిస్తుంది. నువ్వు కనిపెట్టే డ్రగ్ మనిషెంత మద్యం పుచ్చుకున్నా—పెద్ద మనిషి తరహాగా ప్రవర్తించేలా చేస్తుంది. మనిషిని తన్నుతాను మరిచిపోకుండా చేస్తుంది. కానీ మద్యంవల్లనుండే ఇతర ప్రమాదాలను నివారించదు.

నీ వ్యాసం చదివి నీతో పరిచయం పెంపొందించుకున్నాను. నాకోసం పరిశోధన కొనసాగించమన్నాను. మన పరిశోధనలు రహస్యంగా ఉంచమన్నాను. నువ్వు తయారుచేసిన డ్రగ్ సత్ఫలితాల

నిచ్చింది. శ్రీకాంత్ ఇచ్చే మద్యం రుచిని ఎంజాయ్ చేస్తూ కూడా నేను—అతడికి నా రహస్యాలను చెప్పకుండా — అతడి రహస్యాలను లాగగలిగాను. నేను మత్తులో ఉన్నానన్న భ్రమ అతడికి కలిగించాను. అతడికి తప్పుడు సమాచారాన్నందించాను. ఫలితంగా ఓ పెద్ద ముఠా కొద్దిరోజుల్లో బైటపడుతుంది. అందుకు నీకే అభినందనలు.

ఒక్క విషయంలో నిన్ను హెచ్చరిస్తున్నాను. శ్రీకాంత్‌తో నీకాట్టే పరిచయంలేదు. అతడికో బలహీనక్షణంలో నీ డ్రగ్ గురించి చెప్పేశాను. అతడికి విషయం తెలిసిపోయింది. అందుకే నేనిక్కణ్ణించి మకాం ఎత్తేశాను. నువ్వు జాగ్రత్తగా ఉండాలి. వాళ్ళ పగ నా మీదే కానీ నీమీద వుండదని నా నమ్మకం. అయినా యెందుకైనా మంచిదికదా!

మనం మళ్ళీ కలుసుకుందాం. విలువైన నీ పరిశోధన ఫలితాలను—ఇంకా పబ్లిక్ చేయకూడదని నీవనుకుంటే అది నీ యిష్టం. నువ్విచ్చిన డ్రగ్ ఇంకా నా దగ్గరుంది. అదయ్యాక మళ్ళీ నీకుత్తరం రాస్తాను.

శ్రీమతి వసంత భోజనం రుచి శ్రీకాంత్ మద్యాల రుచిని మించింది. ఆమెకు నా అభినందనలు, ధన్యవాదాలు చెప్పు.

ఇప్పట్లో మనం కలుసుకునే అవకాశంలేదు. ప్రస్తుతానికి నేను నా అడ్రసు కూడా ఇవ్వలేను.

నీకీ ఉత్తరమందాక రెండు నెలల్లో ఓ పెద్ద మూఠా బైటపడుతుంది. అది నీ డ్రగ్ మహాత్యమే!

నెలవు నీ

ప్రవీణ్ కూమార్ —"

ఉత్తరం చదవగానే — వెంకన్నకు జరిగిందేమిటో అర్థమయింది. ఉత్తరం ప్రవీణ్ కుమార్ ఊళ్ళో ఉండగానే రాశాడు. ఒక పోస్టాఫీసు నుంచి మరో పోస్టాఫీసుకి రిజిస్టరు లెటరు.

అది చేరడానికింత కాలం పట్టింది.

వెంకన్న ఉత్తరం చదివి పెద్దగా అరిచాడు. ఆ అరుపువిని కంగారుగా లోపల్నించి అతడి భార్య పద్మావతీదేవి, వసంతకూడా పరుగున వచ్చారు.

"ఏమయింది!" అంది పద్మావతీదేవి.

"హాత్యను యెవర్ని తప్పుపట్టాలో తెలిసిపోయింది.."

'ఎవరని?"

"పోస్టల్ డిపార్టుమెంటుని...." అన్నాడు వెంకన్న.

ఆతర్వాత....

నెలరోజుల్లోగానే శ్రీకాంత్ జైల్లో ఉన్నాడు. నగరంలో ఓ ముఠా బైటపడి — పురప్రముఖులు కొందరు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు.

—: ఐపోయింది :—